# మొక్కలు ఎండిపోకుండా చూడండి

మామడ, డిసెంబర్ 2 : బృహత్‌పల్లె ప్రకృతి వనం, పల్లె ప్రకృతి వనాల్లో మొక్కలు ఎండిపోకుండా క్రమం తప్పకుండా నీటిని అందించాలని ఎంపీడీవో రమేశ్ సూచించారు. శనివారం మండలంలోని న్యూసాంగ్వీలో పల్లె ప్రకృతి వనం, నర్సరీలను ఆయన పరిశీలించారు.ఈ సందర్భంగా మట్లాడుతూ నర్సరీల నిర్వహణ సక్రమంగా ఉండాలని,మొక్కలు ఎండిపోకుండా వన నర్సరీల పెంపకదారులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఈజీఎస్ ఏపీవో శివాజీ, ఫీల్డ్ అసిస్టెంట్ భారతి, నాయకులు శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.



న్యూసాంగ్వీ లో నర్సరీని పరిశీలిస్తున్న ఎంపీడీవో రమేశ్

# ఎలాంటి ర్యాలీలు.. సమావేశాలు నిర్వహించవద్దు

భైంసా, డిసెంబర్, 2 : తెలంగాణ శాసనసభ ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా భైంసాలో మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అమలులో ఉందని. దీంతో భైంసా డివిజన్‌లో ఎలాంటి ర్యాలీలు, మీటింగ్‌లు పెట్టవద్దని పట్టణ సీఐ ఎల్ శీను ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎవరైనా వ్యతిరేకంగా వ్యవహరిం చినట్లయితే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

**సోన్‌లో..**

సోన్, డిసెంబర్ 2 : ఎన్నికల్లో గెలుపొందిన పార్టీలు అనుమతి లేకుండా ర్యాలీలు, వేడుకలు నిర్వహించవద్దని సోన్ సీఐ నవీన్‌కుమార్ తెలిపారు. సోన్, లక్ష్మణచాంద, మామడ మండ లాల్లో ఎన్నికల నిబంధ నల మేరకు 144 సెక్షన్ అమల్లో ఉంటుందని తెలిపారు. పార్టీ నాయకులు నలుగురు ఒకచోట గుమిగూడవద్దని, ఊరేగింపులు పటాకులు కాల్చడం, ర్యాలీలు నిర్వహించడం నిషేధమని తెలిపారు. ప్రజలు శాంతి భద్రతల పరిరక్షణకు సహకరించాలని తెలిపారు.

**ఖానాపూర్‌లో..**

ఖానాపూర్ టౌన్, డిసెంబర్ 2 : అసెంబ్లీ ఎన్నికల ఫలితాల నేపథ్యంలో పోలీస్ 30 యాక్ట్, 144 సెక్షన్ అమలులో ఉందని విజయోత్సవ ర్యాలీలు జరుపుకోవద్దని ఎస్ఐ లింబాద్రి పేర్కొన్నారు. పటాకులు కాల్చడం, డీజేలు ఉపయోగించడం గానీ బైక్ ర్యాలీలు నిర్వహించడం నిషేధమని పేర్కొన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రజలు సహకరించాలని సూచించారు.

**ముథోల్‌లో..**

ముథోల్, డిసెంబర్ 2 : ముథోల్ డివిజన్ పరిధిలో ఎలాంటి ర్యాలీలు, మీటింగులకు నిషేధం ఉందని ముథోల్ సీఐ వినోద్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నిబంధనలకు వ్యతిరేకంగా వ్యవహరించిన వారిపై చట్టపరంగా చర్య తీసుకుంటామని తెలిపారు.

# దేవరకోట ఆలయంలో అన్నదానం



అన్నదానం నిర్వహిస్తున్న దేవేందర్ యాదవ్ దంపతులు

నిర్మల్ అర్బన్, డిసెంబర్ 2 : నిర్మల్‌లోని లక్ష్మీ వేంకటేశ్వర స్వామి (దేవరకోట) ఆలయంలో శనివారం స్వామి వారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలను వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య ఘనంగా నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి పూజలు చేశారు. అనంతరం భాగ్య లక్ష్మీ మిల్క్ సెంటర్ దేవేందర్ యాదవ్-రిషిత దంపతుల కుమార్తె శ్రియాన్వి మొదటి పుట్టిన రోజు సందర్భంగా అన్నదానం నిర్వహిం చారు. ఆలయ చైర్మన్ ఆమెడ శ్రీధర్, కౌన్సి లర్లు బిట్లింగ్ నవీన్, నరేందర్, కొండ శ్రీధర్ ఉన్నారు.

# హక్కులను సద్వినియోగం చేసుకోండి

సోన్, డిసెంబర్ 2 : దివ్యాంగుల హక్కులను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సీనియర్ సివిల్ జడ్జి అజేశ్‌కుమార్ పేర్కొన్నారు. నిర్మల్ మండలం కొండాపూర్ శాంతినికేతన్ దివ్యాంగ పాఠశాలలో దివ్యాంగుల దినోత్సవాన్ని శనివారం నిర్వహించగా ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా దివ్యాంగులకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్ర మం లో నిర్వాహకులు చెనిగారపు చిన్నయ్య, సిబ్బంది రాజలింగం, వైద్యులు పాల్గొన్నారు.

# పత్తిలో అంతర పంటగా కందిసాగు

- ఏపుగా పెరగడంతో కళ కళ లాడుతున్న పంట
- ఆనందంలో రైతులు



కంది పంట

భైంసా, డిసెంబర్ 2 : ముథోల్ నియోజకవర్గంలోని భైంసాతో పాటు ఆయా మండలాల్లోని వివిధ గ్రామాల్లో వానకాలంలో సాగు చేసిన పత్తి, సోయా పంటలో రైతులు అంతర పంటగా కందిని సాగు చేశారు. రెండు నెలల క్రితం కురిసిన వర్షాల వల్ల పత్తి పంటకు అక్కడక్కడ ఎండకు తెగుళ్లు సోకి కొంత మేరకు పంట నష్టం వాటిల్లినప్పటికీ అంతర పంటగా వేసిన కంది మాత్రం ప్రస్తుతం ఆశా జనకంగా మారింది. ఏపుగా పెరిగి పంట కళకళలాడుతూ పూత నుంచి కాత దశకు చేరుకుంది. వానకాలం ఆరంభంలోనే కురిసిన తొలకరి జల్లులకు రైతులు దుక్కులు దున్ని పత్తి, సోయాతో పాటు అంతర పంటగా కంది సాగు చేశారు. నియోజకవర్గంలో రైతులు పత్తి పంటకు ఎక్కువగా అధిక ప్రాధాన్యం ఇస్తారు. ఈ యేడు ఆశించిన దానికంటే ఎక్కువగానే వర్షాపాతం నమోదు కావడంతో అంతర పంటగా సాగు చేస్తున్నారు. రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

**ఆశాజనకంగా ఉంది..**



పత్తిలో అంతర పంటగా కంది పంట సాగు చేశాను. ఏపుగా పెరిగిన కంది ప్రస్తుతం పూత నుంచి కాత దశకు చేరుకుంది. పత్తి పంటకు గులాబీ రంగు పురుగు సోకి కొంత నష్టం వాటి ల్లింది. కంది పంట ఆశాజనకంగా ఉండడంతో ఊరట లభించింది.

**- సాయినాథ్, రైతు**

**సస్యరక్షణ చర్యలు చేపట్టాలి..**



కంది సాగు చేసిన రైతులు కందిలో పూత నుంచి కాత దశకు చేరుకున్న రైతులు నిమ్ ఆయిల్ 500 ఎంఎల్ ఎకరానికి రెండు లీటర్లనీటిలో కలిపి పిచికారీ చేయాలి. ఎమామెక్టిన్ బెంజోయేట్ ఒక లీటరు నీటిలో 0.5 ఎంఎల్ కలిపి పిచికారీ చేయాలి.

**- ఏవో రాంచందర్ నాయక్**

# పశువుల ఎరువుతో పంటకు రక్ష

- సేంద్రియంతో భూమికి సారం
- తక్కువ ఖర్చుతో ఎక్కువ దిగుబడి



పశువుల పెంట కుప్ప

భైంసాటౌన్, డిసెంబర్ 2 : రైతులు వ్యవసాయంలో రసాయన ఎరువుల వాడకం పెరిగిపోవడంతో భూమిలోని పోషకాల వినియోగం తగ్గిపోతున్నది. సమతుల్యం లోపించి ఉత్పాదక శక్తి తగ్గుతున్నది. పంటకు చీడపీడలు ఆశించడం, సూక్ష్మ పోషకాల లోపాలతో పంట దిగుబడులు తగ్గుతున్నాయి. రైతులు పంటలు బాగా దిగుబడి రావాలని రసాయన ఎరువులను విపరీతంగా వాడుతున్నారు. దీంతో భూసారం దెబ్బతిని భూమి కోతకు గురై పంట దిగుబడి తగ్గుతున్నది. వీటిని నియంత్రించాలంటే సేంద్రియ ఎరువుల వాడకమే పంటలకు రక్ష. సేంద్రియ ఎరువులు, పశువుల ఎరువులు వాడడం వల్ల పంటలకు ఎంతో మేలు జరుగుతుంది. సేంద్రియ ఎరువులు వాడకం వల్ల నేలకు సహజ సిద్ధంగా బలం చేకూరుతుంది. దీంతో రైతులకు ఎరువుల భారం తగ్గుతుంది. రైతులు పశువుల పాకల్లో ఏడాదికాలంగా నిల్వ ఉన్న పశువుల పెంట, చెత్తా చెదారంతో భూమిలో సారం పెరుగుతుందని, అలాగే మేకలు, గొర్రెలు, కోళ్ల ఎరువు, వ్యవసాయ భూముల్లో పశువుల మందను పెట్టించడంలాంటి పద్ధతులను పాటిస్తే భూసారం పెరిగి పంట దిగుబడి మరింత పెరుగుతుందని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు.

**పశువుల ఎరువుతో భూసారం పదిలం**

రైతులు వేసవిలో పశువుల ఎరువును పంట పొలాల్లో వేస్తుంటారు. ఆ సమయంలో తీవ్రంగా ఎండలు ఉండడంతో ఎరువును పొలంలో వెదజల్లితే వాటిలో ఉన్న పోషకాలు ఆవిరైపోతాయి. అందుకని పశువుల ఎరువును పొలంలో కుప్పలుగా వేసుకోవాలి. ముందస్తు వర్షాలు కురిసిన తర్వాత భూమిపై వెదజల్లాలి. అనంతరం దుక్కిలో కలియదున్నాలి. దీంతో భూమిలో భూసారం పెరిగేలా దోహదపడుతాయి. సేంద్రియ ఎరువులు వాడడం వల్ల భూమిలో ఉన్న ఆమ్లాలు, క్షారాల స్థాయిని పెంచి పంటకు మేలు చేసే సూక్ష్మజీవుల వృద్ధికి తోడ్పాటునందిస్తుంది. దీంతో రైతుకు ఆశించిన పంట దిగుబడి వస్తుంది.

**తక్కువ ఖర్చుతో ఎక్కువ దిగుబడి**

గేదెలు, ఆవులు, గొర్రెలు, మేకల పేడ సాగుకు ఎంతో ఉపయోగపడుతాయి. వేసవి దుక్కులు దున్నకముందే పశువుల ఎరువును పంట పొలాల్లో వేసుకొని దుక్కి దున్నితే తక్కువ ఖర్చుతో ఎక్కువ దిగుబడి పొందేందుకు వీలుంటుంది. రైతులు ఒక్కో ఎకరానికి 3 నుంచి 4 ట్రాక్టర్ల పశువుల ఎరువును ఉపయోగించుకోవాలి. సేంద్రియ ఎరువులు, పశువుల ఎరువును పంట పొలాల్లో వేస్తే సహజసిద్ధమైన లవణాలు పంటలకు అందుతాయి. పశువుల పేడ వేసిన తర్వాత భూమిని దుక్కిలో కలియ దున్నితే నత్రజని, భాస్వరం, పొటాష్‌తో పాటు సూక్ష్మపోషకాలు కూడా తగిన మోతాదులో లభ్యమవుతాయి. దీంతో మొక్కలు ఏపుగా పెరిగి పంట దిగుబడి ఆశించిన స్థాయిలో వస్తుంది. మరికొంత మంది రైతులు చెరువుల పూడిక మట్టి, నల్లమట్టి సైతం వ్యవసాయ భూమిలో వేయించుకుంటారు. ఇది కూడా లాభదాయకమేనని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు.

**పంట దిగుబడి పెరుగుతుంది..**



రైతులు రసాయన ఎరువుల వాడకం తగ్గించి సేంద్రియ ఎరువులను వాడితే ఆశించిన స్థాయిలో పంట దిగుబడి పెరుగుతుంది. పశువుల పేడ వల్ల పంటలకు బలం చేకూరి అధిక దిగుబడి వస్తుంది. పశువుల ఎరువుతో భూమి సారవంతంగా మారి భూసారం పెరుగుతుంది. పశువుల ఎరువు, వర్మీకంపోస్టు, పచ్చి రొట్టె ఇతర సేంద్రియ ఎరువులను వాడాలి.

**- రాంచందర్ నాయక్, వ్యవసాయాధికారి(భైంసా)**

**పశువుల పేడతో పంటకు లాభం..**



పశువుల పేడతో పంటకు చాలా లాభం చేకూరుతుంది. వేసవి దుక్కులు దున్నకముందే పశువుల ఎరువును పొలంలో కుప్పలుగా వేయాలి. తొలకరి వర్షాలు కురిసిన తర్వాత ఎరువును భూమిపై వెదజల్లి భూమిలో కలియ దున్నాలి. దీంతో పంట ఏపుగా పెరిగి ఆశించిన స్థాయిలో పంట దిగుబడి వస్తుంది. రైతులు వీటిపై దృష్టి సారించాలి.

**- దేవన్న, రైతు(మాంజ్రి)**